క్లుప్తంగా

ఐకేపీ కార్యక్రమాలపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్డీఓ సన్యాసయ్య

సత్తుపల్లిరూరల్: ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై డీఆర్డీఓ సన్యాసయ్య మంగళవారం ఐకేపీ సిబ్బందితో సత్తుపల్లి స్త్రీశక్తి భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్ అంశాలపై, రీపేమెంట్స్, బుక్స్ నిర్వహణ, స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్, క్యాంటీన్, బాక్సస యార్డ్ పౌల్ట్రీ మదర్ యూనిట్, మిల్క్ యనిమల్స్ మీ సేవా కేంద్రాలు, ప్రభుత్వ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏపీఎం సుబ్బారావు, డ్వాక్రా ఈఓ రత్న కుమారి, సీసీలు రామారావు, శ్రీనివాస్, కృష్ణ, నరేంద్ర, ఇందిర, వీవోఏలు పాల్గొన్నారు.

మా టీచర్లు మాకే కావాలి..

మధిరరూరల్: పాఠశాలలో పనిచేసిన పాత టీచర్లనే కొనసాగించాలని కోరుతూ మండలంలోని సిరిపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గ్రామంలో నిరసన తెలపగా కనకపూడి శ్రీను తదితరులు మాట్లాడుతూ సిరిపురం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సూర్యదేవర శివ రామకృష్ణ, ఉపాధ్యాయులుగా జీబీఎం ఎస్.రాణి, సునీత విధులు నిర్వర్తించారని తెలిపారు. వీరి హయాంలో బోధన సక్రమంగా సాగగా, ప్రస్తుతం పదోన్నతులు, బదిలీల్లో భాగంగా వీరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని చెప్పారు. అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని పాత ఉపాధ్యాయులనే కొనసాగించాలని శ్రీనుతో పాటు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

అవయవ దానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అశోక్

సత్తుపల్లి: అవయవ దానం చేసినట్లైతే మరణించినా.. చిరంజీవులుగా ఉంటారని తెలంగాణ నేత్ర, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అశోక్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి ఆర్టీసీ ప్రాంగణంలో నేత్ర, శరీర అవయవదానంపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. అన్ని దానాలలో కల్లా అవయవదానం అత్యున్నతమైనదని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లతో పాటు డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్, దామోదర్, అర్జున్, శ్రీనివాస్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శరీరదానానికి అంగీకార పత్రం



పాటిబండ్ల పిచ్చయ్య

మధిర: నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్ పాటిబండ్ల పిచ్చయ్య తన మరణానంతరం శరీరాన్ని ఖమ్మం మమత వైద్య కళాశాలలో బోధనావసరాల నిమిత్తం అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మధిరలో మంగళవారం ఆయన అంగీకార పత్రాన్ని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం బాధ్యుడు మాధవరపు నాగేశ్వరరావుకు అందజేశారు. ఈకార్యక్రమంలో పిచ్చయ్య కుమార్తె సూరపనేని పద్మజ, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పారుపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తదితరులు పాల్గొన్నారు. కాగా, నేత్ర, అవయవ, శరీర దానాల విషయంలో సమాచారం కోసం 77023 26663 నంబర్‌లో సంప్రదించాలని నాగేశ్వరరావు సూచించారు.

ప్రీ స్కూల్ విద్యపై అవగాహన

సత్తుపల్లిటౌన్: చిన్నారులు అక్షరాలు రాసే విధానం.. నేర్చుకోవటం.. చదివించే విధానంపై కథలు చెపుతూ.. పాటలు పాడుతూ నేర్పించే బోధనపై మాస్టర్ ట్రైనర్ జె.సుజాత వివరించారు. సత్తుపల్లిలో ప్రీ స్కూల్ విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. శిక్షణా తరగతుల్లో సంభాషణ, పూర్వ గణిత భావనలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ డి.రత్నమ్మ, సూపర్‌వైజర్లు మల్లీశ్వరి, రమాదేవి, సుజాత, రజిని, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల కమిటీ ఎన్నిక

ఏన్కూరు: మండల కేంద్రంలో మంగళవారం సేవాలాల్ సేన జిల్లా కో కన్వీనర్ భారత్ కిషన్ నాయక్ అధ్యక్షతన సేవాలాల్ సేన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోర్ర బాలాజీ, యువజన అధ్యక్షుడిగా ధరావత్ రాజేందర్‌నాయక్, రైతుసంఘం అధ్యక్షుడిగా ధరావత్ శ్రీనునాయక్ ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు బానోతు శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ఏళ్లుగా ఇంతేనా..?



దాచాపురంలోని లిఫ్ట్ ఇరిగేషన్

దాచాపురం ఎత్తిపోతలతో అవస్థ
- పాత మోటార్లతో రైతుల ఇబ్బందులు
- పంటల సాగుకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తరచూ మరమ్మతులకు గురవుతున్న 30 హెచ్‌పీ విద్యుత్ మోటార్లు



శిథిలావస్థకు చేరిన లిఫ్ట్ ఇరిగేషన్ రేకుల షెడ్డు

వైరారూరల్: దశాబ్దాల కిందట రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి పాత మోటార్లే ఉండడంతో రైతులు ప్రతీ ఏటా పంటలు సాగు చేసుకునేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అలాగే షెడ్డు కూడా శిథిలావస్థలకు చేరింది. దాంతో రైతులు ఎత్తిపోతల షెడ్డుకు మరమ్మతులు చేయాలని, కొత్త మోటార్లు అమర్చాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

33 ఏళ్ల కిందట..

మండలంలోని దాచాపురం గ్రామ సమీపంలో మారుతి పంపింగ్ స్కీమ్ కింద గత 33 ఏళ్ల కిందట 30 హెచ్‌పీ మోటార్లు–3 అలాగే 1.2 కిలో మీటర్ల మేర రెండున్నర అడుగుల సిమెంట్ పైపు లైనుతో లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేశారు. దీని కింద సుమారు 150 మంది చిన్న.. సన్నకారు రైతులు 200 ఎకరాల్లో పంటలను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

పాత మోటార్లు.. పైపు లైన్లు..

ఎన్నో ఏళ్లుగా పంటలకు నీటిని అందిస్తున్న పాత మోటార్లు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. మోటార్ వైరింగ్ కాలిపోవడం, పైప్‌లైన్లు శిథిలమై పోవడం తదితర సాంకేతిక సమస్యలతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైరింగ్ కాలిపోయిన ప్రతీసారి రైతులు విరాళాలు సేకరించి మరమ్మతులు చేయిస్తున్నారు. కొన్నిసార్లు శిథిలమైన పైప్‌లైన్ల ద్వారా కూడా సరిగా నీరు పారడం లేదని, దీంతో పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు ఎత్తిపోతల పథకం కోసం ఏర్పాటు చేసిన షెడ్డు ఎప్పుడు కూలుతుందో కూడా తెలియని పరిస్థితి. ఈ విషయమై రైతులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

లిఫ్ట్ ఇరిగేషనే ప్రత్యామ్నాయం..

దాచాపురం గ్రామానికి చెందిన పెద్ద తరహా రైతులు వైరా నది ఏటిలో విద్యుత్ మోటార్లను అమర్చుకోని ఏడాదికి రెండు పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ కింద సుమారు 150 మంది చిన్నసన్నకారు రైతులు సుమారు 200 మంది రైతులకు ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌వే ప్రత్యామ్నాయంగా మారింది.

ఆయకట్టు పెరిగే అవకాశం..

ప్రస్తుతం ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు కింద సుమారు 200 ఎకరాల సాగు భూమి ఉంది. శిథిలావస్థలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ షెడ్డును మరమ్మత్తులు చేసి కొత్త మోటార్లను ఏర్పాటు చేసి పైపు లైను మరమ్మత్తులు చేపడితే లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు సుమారు 30 నుండి 50 ఎకరాల మేర పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నసన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకోని లిఫ్ట్ ఇరిగేషన్‌లో ఉన్న 30 హెచ్‌పీ మోటార్లు–3 కొత్త మంజూరు చేయించి, లిఫ్ట్ ఇరిగేషన్ షెడ్డు, పైపు లైను మరమ్మత్తులు చేపించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నసన్నకారు రైతులను ఆదుకోవాలి. దశాబ్దాలుగా పాత మోటార్లు వాడకంలో ఉండడంతో అవి తరచూ.. మరమ్మతులకు గురవుతున్నాయి. వాటికి బాగుచేసి ప్రతీ ఏటా పంటలు సాగు చేసుకుంటున్నాము. ఈసారైన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త మోటార్లను మంజూరు చేసి ఇబ్బందులను తొలగించాలి.

– మదుపల్లి బాబు, రైతు, దాచాపురం

వ్యర్థాలు పేరుకుపోయాయి..



ఎత్తిపోతల పథకాలకోసం సుమారు 1.2 కిలో మీటర్ల మేర సిమెంట్ పైప్‌లైన్లు వేశారు. అవి పాతవి కావడంతో పైపుల్లో అనేక వ్యర్థాలు పేరుకుపోయి ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– వేల్పుల ఆంధ్రం, రైతు, దాచాపురం

పట్టించుకోవడం లేదు..



శిథిలావస్థలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ షెడ్డును మరమ్మతులు చేసి కొత్త మోటార్లను అమర్చాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా.. పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. కొత్త మోటార్లు ఏర్పాటు చేస్తే.. ఆయకట్టు కింద సుమారు 30 నుంచి 50 ఎకరాల వరకు సాగు పెరిగే అవకాశం ఉంది.

– వేల్పుల జయరాజు, మాజీ సర్పంచ్, దాచాపురం

సంగారెడ్డి చెరువును పరిశీలించిన ఆర్డీఓ



చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేంద్రగౌడ్, ఇతర అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలో గల సంగారెడ్డి చెరువు పరివాహక ప్రాంతం ముంపు భూములను, సాగర్ నీరు సరఫరా కెనాల్‌ను మంగళవారం సాయంత్రం కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, జలవనరుల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. సంగారెడ్డి చెరువు తూముతో పాటు చెరువు కట్టకు సంబంధించి దీర్ఘ కాలంగా వివాదం నడుస్తున్నందున అధికారుల పరిశీలించారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎన్ఎస్‌పీ డీఈఈ రత్నాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో 'సాయిస్ఫూర్తి' విద్యార్థుల ప్రతిభ





కె.నీరజ ఆరేపల్లి త్రివేణి నవ్యమాధురి

సత్తుపల్లిరూరల్: బీటెక్ చివరి సంవత్సరం ఫలితాలను మంగళవారం వెల్లడించగా సత్తుపల్లలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్‌బాబు తెలిపారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ఈఈఈలో పసుపులేటి దుర్గారావు 9.3, ధర్మావత్ ప్రకాష్ 9.1 ఎస్‌జీపీఏ, మెనికల్ విభాగంలో మహిస్కో వినోద్ 8.1, పోతు రాజు నరేంద్ర 7.9, ఈసీఈలో కొడుమూరు నీరజ 9.4, ఆరేపల్లి త్రివేణి 9.3, సీఎస్ఈలో అడపా నవ్య మాధురి 8.7, అవిరిపనేని సుష్మ 8.5, సీఎస్ఎంలో నాలా అమృష 9.1, క్షత్రియ భారతి 8.7 ఎస్‌జీపీఏ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను హెటిరో ఫార్మాస్యూటికల్ అధినేత, ఎంపీ, కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బండి అన్విత వర్చువల్‌గా అభినందించారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

'విజయ' విద్యార్థుల..

కొణిజర్ల: ఈ నెల 24న విడుదల చేసిన బీటెక్ ఫైనల్ ఇయర్ ఫలితాల్లో కొణిజర్ల మండలం అమ్మపాలెంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్ బాబు తెలిపారు. జేఎన్‌టీయూ ఫలితాల్లో కళాశాలకు చెందిన ఎం.ఎస్తేర్, బి.కల్పన, జి.మహేష్, కె.లావణ్య, ఎస్.రజిత, కె.అజయ్, ఎస్.శ్రావ్య, వి.ఆనందిని, 9 శాతానికి పైగా జీపీఏ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, వివిధ విభాగాల హెచ్ఓడీలు విద్యార్థులను అభినందించారు.


ఇంటర్ ఫలితాల్లో ఠాగూర్..



విద్యార్థులను అభినందిస్తున్న క్రాంతి కళాశాల యాజమాన్యం

వైరా: మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో వైరాలోని ఠాగూర్ విద్యా సంస్థల క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణారావు, ఎస్ఎస్ఎస్ పీఓ లింగారావు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్ర అధికారిగా బాలకృష్ణ



బాలకృష్ణ

మధిర: మధిర అగ్నిమాపక కేంద్రం అధికారిగా టి.బాలకృష్ణ మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అగ్ని ప్రమాద నివారణకు కృషి చేస్తానని తెలిపారు.

జీతాలు ఇప్పించండి

కల్లూరురూరల్: గత ఎనిమిది నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్మికులు మంగళవారం ఎంపీడీఓ సురేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో 93 మంది సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ఈనెల 26న తమ సమస్యలను జిల్లా అధికారులకు తెలపడానికై ప్రతీ పంచాయతీ నుంచి ఇద్దరు కార్మికులకు అనుమతి ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లూర్ధుమాతా చర్చిలో దివ్యబలిపూజ

తల్లాడ: తల్లాడ లూర్ధుమాతా చర్చిలో మంగళవారం రాత్రి దివ్యబలిపూజా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా లూర్ధుమాతా చర్చి ఫాదర్ అజయ్ వాక్యోపదేశం చేశారు. ఈ ప్రార్థనలో ఫాదర్లు, ఉపదేశికులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు

కారేపల్లి: కారేపల్లి ఆదర్శ కళాశాల ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీలకు గాను.. ఈ నెల 27న ఉదయం 9.30గంటలకు.. పదిలో వచ్చిన జీపీఏ ప్రాతిపదికన ప్రవేశాలు ఉంటాయని ప్రిన్సిపాల్ అన్నారు. ప్రవేశం పొందగోరు విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలు మరియు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఆదర్శ పాఠశాల ఆఫీస్ నందు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

శివాలయానికి రూ.లక్ష వితరణ



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాతలు

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం శివాలయానికి మండెపుడి వెంకటేశ్వర్లు, కస్తూరి దంపతుల కుటుంబ సభ్యులు మంగళవారం రూ.లక్ష వితరణగా అందజేశారు. గతంలో గుడి నిర్మాణానికి రూ. 1.25లక్షలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు ముందుకు రావాలని కోరారు. విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు లలిత, శివకల్యాణ్, హసిక, కేయా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహించాలి

బోనకల్: పదోన్నతుల అనంతరం ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కంటే ముందే పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. పదోన్నతులపై బోనకల్ మండలానికి వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రీతం, గుగులోతు రామకృష్ణ, సౌభాగ్య లక్ష్మి, కమలాకర్, విష్ణువర్ధన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సంఘం అధ్యక్షుడిగా భాస్కర్

కొణిజర్ల: కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బొమ్మగాని భాస్కర్ విజయం సాధించారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన కల్లుగీతకార్మిక సంఘం ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు పాల్గొనగా.. 378 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం కౌంటింగ్ ప్రారంభించిన అధికారులు ఫలితాలు వెల్లడించారు. బొమ్మగాని భాస్కర్‌కు 51 ఓట్లు రాగా ఆయన సమీప ప్రత్యర్థి బొమ్మగాని నాగేశ్వరరావుకు 46 ఓట్లు వచ్చాయి. దీంతో భాస్కర్ 5 ఓట్ల మెజార్టీతో గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

వ్యాపారి ఆచూకీ గుర్తించండి



ఎస్సై వెంకటేష్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు గ్రామానికి చెందిన మిర్చి కొనుగోలు వ్యాపారి ఖరీదు కృష్ణారావు పలువురి రైతులకు రూ. 2.20 కోట్ల మేరకు టోకరా పెట్టిన విషయం విదితమే. మోసం చేసి ఉడాయించిన వ్యాపారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే బాధిత రైతులు మధిర సీఐ, ఎర్రుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం మరోసారి ఎస్సై పి.వెంకటేష్‌ను కలిసి గోడు వెలుబుచ్చుకోగా.. ఎస్సై మాట్లాడుతూ.. మిర్చి వ్యాపారిని పట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సైని కలిసిన వారిలో రేలచర్ల రామకృష్ణ, బాలకృష్ణ,వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి,చీరాల పిచ్చియ్య, రామిశెట్టి వాసు, రేలచర్ల బాలకృష్ణ, శీలం లక్ష్మారెడ్డి, రేలచర్ల సతీష్, రేలచర్ల వీరభద్రరావు,చీరాల ముత్తయ్య తదితరులు ఉన్నారు.

మతోన్మాద రాజకీయాలకు బీజేపీ కుట్ర



వేంసూరు: మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు భారతి

వేంసూరు/ఎర్రుపాలెం/చింతకాని/కారేపల్లి: మతోన్మాద రాజకీయాలకు బీజేపీ కుట్ర పన్నుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, పొన్నం వెంకటేశ్వరరావు సీపీఎం డివిజన్ నాయకుడు పాపినేని రామనర్సయ్య, జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బొంతు రాంబాబు తెలిపారు. మంగళవారం వేంసూరులోని మర్లపాడులో, ఎర్రుపాలెం, చింతకాని మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో, కారేపలిలలో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించి వారు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్ముతున్న మోడీ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త సిద్ధాంతం పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ రాజకీయం అనే పాఠాన్ని పార్టీ సభ్యులకు బోధించగా.. వర్తమాన రాజకీయాలు – పరిస్థితులు అనే అంశంపై పాపినేని రామనర్సయ్య వివరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు దివ్వెల వీరయ్య, మడుపల్లి గోపాలరావు, నాయకులు సంజీవరావు, రాములు, హనుమంతరావు, జోగయ్య, కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు విఠల్, సీపీఎం మండల కమిటీ సభ్యులు మల్లూరు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీను,సాధు శరత్, జానికిరాములు, వెంకటనర్సయ్య, కృష్ణమూర్తి, యజ్ఞనారాయణ, బస్వయ్య, ఎపిఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేంద్ర, నాయకులు రామారావు, దేవప్రకాష్, భస్సీలాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మధిర: మాట్లాడుతున్న తాండ్ర వినోదరావు

వైరా/మధిర: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ డిమాండ్ చేశారు. వైరాలో నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఆపసోపాలు పడుతుందన్నారు. వానాకాలం మొదలైనా రైతు భరోసా వేయలేదన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ప్రతిపాదనలు ఎమయ్యాయన్నారు. వైరాలో 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి సర్వేలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని తెలిపారు. అదే విధంగా మధిర పట్టణంలో ఉన్న బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వినోద్‌రావు మాట్లాడుతూ.. మధిరలో పలు రైళ్లను నిలిపేందుకు కేంద్ర మంత్రులతో మాట్లాడి హాల్టింగ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్యాం రాథోడ్, చావా కిరణ్, యం వెంకటకృష్ణ, ఏ భద్రయ్య, నరేష్, రామారావు, గోపాలకృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, రాజు, సంధ్య, బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు సాంబశివరావు, రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, నరసింహారావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

సత్తుపల్లిటౌన్: చిన్నారులు తొమ్మిది రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్ అన్నారు. స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం చిన్నారులకు వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్త సుష్మ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వేంసూరు: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీపీఐ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడారు. కార్మికులకు పెండింగ్ బిల్లులతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ లాల్ మహ్మద్, ఎస్‌కె రంజాన్‌బి, బింగి నాగవెంకటేశ్వరరావు, బుచ్చాలు, వెంకటేశ్వరరావు, సామ్రాజ్యం, హమీదుసాదు, సూరమ్మ, సీతమహాలక్ష్మి, శుభంబి, రవీంద్ర, పార్వతి ఇందిరా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ముదిగొండ: ముదిగొండలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వప్రాథమిక విద్య, నూతన సిలబస్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ కమలప్రియ, ట్రైనర్ షాకీరా, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

చింతకాని: రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య తెలిపారు. చింతకాని గ్రామంలో రైతులు సాగుచేసిన పంటలపై మంగళవారం సర్వే నిర్వహించి మాట్లాడారు. రైతులు సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయ విస్తర్ణాధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు, వ్యవసాయ విస్తర్ణాధికారి రజిని తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామానికి చెందిన సాయి, ఖమ్మం నగరానికి చెందిన దేశబోయిన తేజస్విని లకు చెందిన ఫోన్లు చోరీ కాగా.. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అట్టి సెల్‌ఫోన్లను ఎస్సై నాగుల్‌మీరా మంగళవారం బాధితులు అందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గడల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

సత్తుపల్లిటౌన్: గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఎస్టీ బాలుర హాస్టల్ సంక్షేమాధికారి బి.రాములు కోరారు. మంగళవారం హాస్టల్‌లోని 180 మంది విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి నోట్ పుస్తకాలు, దుప్పట్లు, టవల్స్, స్వెట్టర్లు, సబ్బులు, ట్రంక్ పెట్టెలు తదితర సామగ్రిని పంపిణీ చేశారు.

గ్రామగ్రామాన లయన్స్‌క్లబ్ సేవలు



కొణిజర్ల జీపీ సిబ్బందికి ఫ్రీజర్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కొణిజర్ల: లయన్స్‌క్లబ్ సేవలు గ్రామ గ్రామానికి విస్తరిస్తున్నాయని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్‌వీ ప్రసాద్ అన్నారు. కొణిజర్ల పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం ఖమ్మం లయన్స్‌క్లబ్ సభ్యులు ఫ్రీజర్‌ను అందించి మాట్లాడారు. రూ.2 లక్షల విలువ గల ఫ్రీజర్‌ను మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కొణిజర్లకు చెందిన నిరుపేదరాలు కళావతికి రూ.9,500 విలువ చేసే కుట్టుమిషన్, ఇతర వస్తువులు అందించారు. అదే విధంగా పల్లిపాడు సర్కిల్‌లో గల 27 అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు గిన్నెలు, స్పూన్‌లు, ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో గవర్నర్ సీహెచ్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ రోజారాణి, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్ డీవీసీ రావు, లయన్స్‌క్లబ్ ఖమ్మం అధ్యక్షుడు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, సభ్యులు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు వితరణ..

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. తల్లాడ, నారాయణపురం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో పది సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తల్లాడ ఎస్సై ఏడు కొండలు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ దారా శ్రీనివాసరావు, అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, ఆంజనేయులు, కనకదుర్గ, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, సీతారామిరెడ్డి, బ్రహ్మారెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.